10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

బుధవారం 6 నవంబర్ 2024 పేజీలు 8

## బీఆర్ఎస్‌కు మంత్రి శ్రీధర్ బాబు 10 ప్రశ్నలు

- తెలంగాణలో అమరవీరుల సంఖ్యను బీఆర్ఎస్ తగ్గించిందని విమర్శ
- అధికారంలో ఉన్నప్పుడు అమరవీరుల కుటుంబాలను విస్మరించిందని మండిపాటు
- పార్టీని విలీనం చేస్తామని మాట తప్పారన్న శ్రీధర్ బాబు



హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ నేతలకు మంత్రి శ్రీధర్ బాబు పది ప్రశ్నలు సంధించారు. తెలంగాణలో అమరవీరుల కుటుంబాల సంఖ్యను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విడతలవారీగా తగ్గించిందని ఆరోపించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉద్యమంలో బలిదానాలపై నాడు కేసీఆర్ అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేశారన్నారు. మొత్తం 1,200 మంది బలిదానం చేసుకున్నట్లు

-2 లో

### రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడమే మా కర్తవ్యం: రేవంత్ రెడ్డి

# రాహుల్ మాటిస్తే శాసనం.. తెలంగాణలో కులగణన చారిత్రకం

- కులగణన సర్వేను తమ ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్న సీఎం
- కులగణనను మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలనేది రాహుల్ ఆలోచన అని వెల్లడి
- 2025 జనగణనలో ఈ కులగణనను పరిగణలోకి తీసుకోవాలన్న సీఎం



హైదరాబాద్ పెన్ పవర్:మనది రైజింగ్ తెలంగాణ... కాబట్టి దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడం మన కర్తవ్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బోయినపల్లి గాంధీ తత్వ చింతన కేంద్రంలో కులగణనపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కులగణన సర్వేను ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు.కులగణనపై తమ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చడమే ప్రథమ కర్తవ్యమన్నారు. కులగణనను మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలనేది రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. కులగణనను త్వరితగతిన పూర్తి చేసి బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లను అందిస్తామని స్పష్టం చేశారు.

-2 లో

# రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- వచ్చే ఏడాది జనవరి నుంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని వెల్లడి
- సన్నధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని వ్యాఖ్య
- ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని పిలుపు




హైదరాబాద్ పెన్ పవర్: రేషన్ కార్డుదా రులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వచ్చే ఏడాది జనవరి నుంచి తెలంగాణవ్యాప్తంగా రేషన్ కార్డు ఉన్న వారందరికీ సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇది దేశ చరిత్రలో ఓ మైలు రాయి అన్నారు. ధాన్యం సేకరణకు సం బంధించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దాన్యం సేకరణ

-2 లో

# నిన్నెవరు రమ్మనరు.. కేటీఆర్‌పై ఆటో డ్రైవర్ల ఫైర్

- మాకు పదేండ్లలో ఏం చేసింద్రు
- స్వార్థ రాజకీయాల కోసమే వచ్చింద్రు
- ఆగ్రహం వ్యక్తం చేసిన నిరసన కారులు

హైదరాబాద్ పెన్ పవర్:'నిన్నెవరు రమ్మన్నరు.. మేం పిలవనేలేదు.. ఎందుకు వచ్చింద్రు. మేం ఎవరితోనూ కబురు పెట్టలే.. పిలవకున్నా ఎందుకు వచ్చారు' అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ను ఆటో డ్రైవర్లు నిలదీశారు. ఇందిరా పార్క్ వద్ద ఆటో యూనియన్లు చేపట్టిన మహాధర్నాకు మద్దతు తెలిపేందుకు వచ్చిన కేటీఆర్‌కు చుక్కెదురైంది. పదేండ్లు అధికారంలో ఉండి తమకేమీ చేయలేదని అన్నారు. కేవలం వ్యక్తిగత, స్వార్థపూరిత రాజకీయాల కోసం ఆయన

-2 లో





### ఇందిరాపార్క్ వద్దకు ఆటోలో

# ప్రయాణించిన కేటీఆర్

- హామీలు అమలు చేయాలంటూ ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నా
- మహాధర్నా వద్దకు ఓ ఆటోలో చేరుకున్న కేటీఆర్
- ఆటో డ్రైవర్‌తో ముచ్చటించిన కేటీఆర్





హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆటోలో ప్రయాణించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహా ధర్నా ప్రాంతానికి ఆయన ఆటోలో చేరుకున్నారు. కేటీఆర్ మొదట నందినగర్‌లోని తన నివాసం నుంచి కారులో బయలుదేరారు. ఆ తర్వాత కొందరు సీనియర్ నాయకులతో కలిసి ఆటో ఎక్కిన కేటీఆర్ మహాధర్నా వద్దకు

-2 లో

# రాహుల్ మాటిస్తే శాసనం.. తెలంగాణలో కులగణన చారిత్రకం

- మొదటి పేజి తరువాయి
ఈ కులగణనను 2025 జనగణనలో పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఈ వేదిక పైనే తీర్మానం చేస్తున్నామన్నారు. కులగణనపై పౌర సమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్ గాంధీ హైదరాబాద్ రావడం గొప్ప విషయమన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు కులగణన సర్వే కీలకమన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. భారత్ జోడో యాత్ర ఎంతో మందిని కదిలించిందని కులగణన సంప్రదింపుల సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేస్తున్నామని, ఇందిరా గాంధీ 'గరీబ్ హఠావో' అనే నినాదంతో చరిత్రలో నిలిచారని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో కులగణన చారిత్రకం కాబోతోందని, రాహుల్ గాంధీ నేతలకు మాట ఇస్తే అది శాసనమని రేవంత్ చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణనపై ముందుకెళ్తున్నామని, కులగణన చేసి తెలంగాణ దేశంలో ఆదర్శంగా రాష్ట్రంగా నిలవబోతోందని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో చెప్పారు.

కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ కు వచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి తెలంగాణలో ప్రారంభించనున్న కుల గణనపై ప్రజలు, మేధావులు, వివిధ సామాజిక వర్గాల వారి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. బోయిన్ పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ లో ఈ సదస్సు జరిగింది.

## ఇందిరాపార్క్ వద్దకు ఆటోలో
# ప్రయాణించిన కేటీఆర్

- మొదటి పేజి తరువాయి
చేరుకున్నారు. ఆటో డ్రైవర్‌తో కేటీఆర్ కాసేపు ముచ్చటించారు. ఆయన ఆటోలో కూర్చొని వెళుతుండగా కొంతమంది కార్యకర్తలు, అభిమానులు ఆయనతో సెల్ఫీ తీసుకోవడానికి పోటీపడ్డారు.

**హామీలు అమలు చేయాలని మహాధర్నా**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు పథకం కారణంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్లు మహాధర్నా నిర్వహిస్తున్నారు. ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నారు. మహాలక్ష్మి స్కీంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనిని వెంటనే అమలు చేయాలని డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. యాప్‌లతో అనుమతి లేకుండా నడుస్తున్న టూ వీలర్లను నిషేధించాలని కోరుతున్నారు. ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

# నిన్నెవరు రమ్మనరు..
# కేటీఆర్‌పై ఆటో డ్రైవర్ల ఫైర్

- మొదటి పేజి తరువాయి
ధర్నాకు వచ్చారని.. తమ కోసం రాలేదని ఆరోపించారు. ప్రశాంతంగా నిరసన తెలుపుతున్న తమను రాజకీయాలకు వాడుకోవద్దని అన్నారు.

**మార్పు కొంపలు ముంచింది**

కాంగ్రెస్‌ఆరు గ్యారెంటీల పేరుతో అనేక హామీలిచ్చి అందరి నోట్లో మట్టి కొట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇవాళ ఆటో డ్రైవర్ల ధర్నాలో ఆయన మాట్లాడారు. మార్పు, మార్పు అనుకుంటూ కొంపలు ముంచిందని అన్నారు. 'నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, మహిళలు అందరినీ కాంగ్రెస్ మోసం చేసింది. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. రాహుల్ గాంధీ చెప్పిన తియ్యని, కమ్మని మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది. సంక్షేమ పథకాలకు మేం వ్యతిరేకం కాదు. మానవత్వంతో స్పందించి హామీలు నెరవేర్చాలి. ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 5వేలు ఇవ్వాలి.
రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. నల్గొండలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఎదుట కాంగ్రెస్ నాయకుడే మనం బయటకు వెళ్తే తన్నే పరిస్థితి ఉందని చెప్పాడు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రజల కోసం పోరాడతం' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

# బీఆర్ఎస్‌కు మంత్రి శ్రీధర్ బాబు 10 ప్రశ్నలు

- మొదటి పేజి తరువాయి
సీఎం హోదాలో కేసీఆర్ నాడు చెప్పారన్నారు.
కానీ ఆ తర్వాత విడతలవారీగా తగ్గించుకుంటూ వచ్చి అమరవీరుల సంఖ్యను 1,200

నుంచి 585కు తగ్గించారన్నారు. మిగిలిన 615 మంది అమరవీరుల సంఖ్య ఏమైందని ప్రశ్నించారు. అధికార పార్టీపై బీఆర్ఎస్ నేతలు చేసిన విమర్శలు సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు.

- బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అమరవీరుల కుటుంబాలను ఎందుకు విస్మరించింది?
- బలిదానాలను 1,200 నుంచి 585కు ఎందుకు తగ్గించారు? మిగతా 615 మంది ఏమయ్యారో చెప్పాలి?
- అమరవీరుల కుటుంబాలకు కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?
- అధికారంలోకి వస్తే దళితుడిని సీఎంగా చేస్తానని కేసీఆర్ చెప్పారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు. ఈ హామీలు నెరవేర్చారా?
- సోనియమ్మను పొగిడిన వాళ్లే ఇప్పుడు కించపరచడం లేదా? పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని చెప్పి మాట తప్పింది ఎవరు?
- అధికారంలోకి రాగానే నిరుద్యోగం అనేది లేకుండా చేస్తామని చెప్పి... మోసగించలేదా?
- గ్రూప్-1 పరీక్షలు కూడా సరిగ్గా నిర్వహించని అసమర్థత ఎవరిది? నిరుద్యోగుల ఉసురు పోసుకుంది ?
- డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేసింది ఎవరు? కేజీ టు పీజీ విద్య అమలు చేశారా?
- కేసీఆర్ చెప్పినట్లుగా 16 లక్షలకు కాకపోయినప్పటికీ కనీసం లక్ష ఎకరాలకైనా సాగునీరు అందించారా?
- ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత కేసీఆర్ ఇంటికే పరిమితం కాలేదా? కానీ మా నేత రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతున్నారు. బీఆర్ఎస్ ఉపప్రాంతీయ పార్టీగా మారి ఉనికి కోల్పోతోంది నిజం కాదా?...

అంటూ మంత్రి ప్రశ్నల వర్షం కురిపించారు.

# రేషన్ కార్డుదారులకు
# తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- మొదటి పేజి తరువాయి
కేంద్రాల్లో ఎలాంటి గందరగోళం ఉత్పన్నం కాకుండా... రైతులకు మద్దతివ్వడానికి ప్రజాప్రతినిధులు క్షేత్ర పర్యటనలు నిర్వహించాలన్నారు. సన్న ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడం చారిత్రాత్మకమన్నారు. ధాన్యం సేకరణను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఈరోజు సాయంత్రం ఆయన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



## మూసీ ముచ్చట్లు..

ఎపిసోడ్-5

# చేదునాదు, తీపినాదుండే కల్లు... సప్పసతుకు అయిపాయె..!

**హైదరాబాద్, పెన్ పవర్, నవంబర్ 5:** తెల్లారంగనే గౌండ్లోళ్లు సైకిండ్లేసుకొని కాల్వ కిందకు పోయేటోళ్లు. ఏట్లకు పోయే తొవ్వ కూడ సక్కగుండేది కాదు. ఆ బాట మీదంగనే జరంత సేపు సైకిలు తొక్కుకుంట.. బురదున్న కాడ సైకిల్ దిగి ఒక సైడు పొంటి నడ్సుకుంట ఎట్లోగట్ల కాల్వ కిందకు చేరేటోళ్లు.. ఏటి సుట్టుపక్కలున్న సంగపేషన్, మూల మడత, గొల్లపల్లి రేవు, ఉసికెరేవు పంపు, మర్రేన కింద శిన్న శిన్న గుడిసెలుండేవి.. రాత్రి కల్లు ఒడిసినంక మోకులు అండ్లనే భద్రంగ పెట్టేటోళ్లు.. పొద్దుగాల మల్ల ఆడికే పొయ్యి మోకులు కట్టుకునేటోళ్లు. చిరుతబద్దకు మంచి పలుగురాళ్లతో నెరుసు పెట్టేటోళ్లు.

ఆ చిరుతబద్ధకు ఒక కొనకు ఇనుప గొలుసుండేది. దానికి గజ్జెలుండేవి. తాళ్లెక్కడానికి ఆళ్లు పొలాల మధ్యల నుంచి నడ్సుకుంట పోతుంటే అవి ఘల్లు ఘల్లుమని సప్పుడు జేసేవి. బాటల ఏదన్న పురుగుబూషి ఉంటే ఆ సప్పుడుకు పోతయన్నట్లుగా ఈ గజ్జెలు కట్టేటోళ్లు. మోకును తాడు సుట్టు వేసి తాడుకు దండం పెట్టి కల్లు గీసేందుకు తాడెక్కడం నేను శానా సార్లు చూశాను. ఇగ తాడు మధ్యలోకి పోంగనే మోకు భుజాల నుంచి దించి నడుంకు ఏసుకునేడిది. ఓరలున్న చిరుతబద్ద తీసి కత్తి మంచిగ నూరుకొని మిగిలిన సగం తాడెక్కెటోళ్లు.

మూసీ నది ఒడ్డంటే ఎవుసం, చేపలే కాదు... అమృతలాంటి కల్లు దొర్కేది. ఒక పదిహేనేండ్ల కింద వరకు కూడ మా సంగెం మూసీ పక్కల 60 మందికి పైగ గౌడన్నలు కులవృత్తి చేసేటోళ్లు. పొద్దుగాల, సాయంత్రం.. రెండు సార్లు తాళ్లెక్కేది. మూసీకి రెండు దిక్కుల ఎటు జూసినా తాటి చెట్లే. ఎవరైన తాటి చెట్ల తోట పెంచుతున్నరా అన్నట్లు ఉండేవి. గీ తాళ్లకు కూడ తీరొక్క పేర్లుండేవి. అగ్గిరథం, బీంపాత్మ, సురబొమ్మ, కంట్లమూడి, మంచెమర్రి, పెంజరమర్రి, పుట్టతాడు, సన్నోంబొత్త.. ఇట్ల ఆటిని పిల్చుకునేటోళ్లు. కల్లు రుచిని బట్టి, ఆ చెట్టున్న తీరును బట్టి ఈ పేర్లొచ్చేవి.

గౌడన్నలు తాళ్లు పంచుకునేటప్పుడు కూడ గీపేర్లను బట్టే పంచోటి ఏసుకునేటోళ్లంట. లొట్ల కొద్ది కల్లయ్యేది. పొద్దుగాల 8 కొట్టిన సందే శానామంది కల్లు తాగనీకి కాల్వ కింద బాట పట్టేటోళ్లు. సాయంత్రమయితే సందడి మరీ ఎక్కువగ ఉండేది. నాకు గా ఫలానా చెట్టు కల్లే కావాలి.. అంటూ డిమాండ్లు యిన్పించేవి. పొద్దుగుంకే ఏలలో మూసీ గలగలల మధ్య కమ్మటి కల్లు తాగుతు మైమరిచిపోయేటోళ్లు. ఎక్కడెక్కడి సంగతులన్నీ ఈడ ముఖ్యమైన ముచ్చట్లయ్యేయి. పోద్దాడు, పందాడు కల్లు రుచిగ ఉండేది. పరుపుదాడు కల్లు తాగితే ఏర్గబెడ్తదని జర తక్కువ తాగేటోళ్లు. సుట్టపోళ్లొస్తె కల్లు తాపకుండ పంపితే గాళ్ల పరువు పోయినట్లే అనుకునేడిది.

మా ఊరి కల్లు శానా ఫేమస్. ఏట్ల నీళ్లు మంచిగ ఉండటం, కాల్వలల్ల కూడ పారుతుండటంతో కల్లు మంచిగయ్యేది. చేదునాదు, తీపినాదుండేది. నేనెప్పుడున్న వరిశేన్ల వాలే కొంగల్ని కొట్టనీకి బోతే తాటి రేకల కల్లు పోసి తాగమంటుడె. పొద్దుపొద్దుగాల గా కల్లు తాగుతుంటే కడుపు సురసురమనేది. ఇంటికొచ్చినంక ఎంతన్నం తింటోళ్లమో. బాగ ఆకలయ్యేది. మా ఊరోళ్లతో పాటు సుట్టుపక్కలున్న సూరపల్లి, జంపల్లి, పత్తల్ల బోడు తండాల నుంచి శానా మంది కల్లు తాగేందుకు ఒచ్చేది. ఆళ్లు ఓస్తస్తనే... మడుగుల చేపలు గుప్పి పట్టుకొచ్చుకునేడిది. పట్టరానోళ్లు ఆడ్నే ఉన్న బెస్తన్నల్ల కాడికి పోయి గుల్ల నిండ తెచ్చుకునేది. అట్ల నలుగురైదుగురు కల్సి ఒక పటువ కల్లు తెచ్చుకునేది.

కంప మండలు, కట్టె పుల్లలేసి మంటపెట్టి చేపలు కాల్చేడిది. కడుపు నిండ కల్లుతాగి చేపలు తిని నిమ్మలంగ పోయేడిది. "అబ్బ... గౌడ్ సాబ్ ఇయ్యాల ఏం కల్లు పోసిండురా.. యిసమున్నట్లు ఉంది" అంటూ సంబరపడేటోళ్లు. మా ఊర్ల ఒక పెద్దామె ఉండేది. మా ఊర్ల ఒక పెద్దామె మాపటి జామున కల్లు తాగే యాల్లయ్యేసరికి గుడాలు, బొబ్బుడాలు గంపల పెట్కోని కాల్వ కట్ట కాడకు ఒచ్చేది. బాయిలకాడ ఎవుసం చేసేటోళ్లు తీర్కలేక కాల్వ కిందకు వచ్చేటోళ్లు కాదు. గందుకే ఆడికె పట్టేటోళ్లు. సాయంత్రం తర్వాత ఇండ్ల కాడికే ఆడికముంత తెచ్చిపెట్టిపోయేడిది. పొద్దుగుంకె టైంల కాల్వ కింద నుంచి ఆడోళ్లు పెద్ద పెద్ద కల్లు కుండలను నెత్తిన పెట్టుకొని ఇంటి దారి పట్టేటోళ్లు.


ఇగ ముంజయిలతే చెప్ప వశం కాదు. ఏటి పొడవునా తాటి బొత్తలుండేవి. ఎండకాలంల శానా మందికి ఇదో ఉపాధి. తెల్లారకముందే ముంజగొలలు కొట్టి ముంజలు తీసి పెద్ద పెద్ద గంపలనిండా నింపేటోళ్లు. ఆటోలల్ల తీస్కపోయి పట్నంల అమ్ముకుని వచ్చేది. గిప్పుడు ఎట్లుందో ఆర్సుకుందామని మా బాబాయ్ వీరమల్ల వెంకటేష్ గౌడుకు ఫోన్ చేసిన.

## 'ఏముంది బేటా..

గా కెమికల్ నీళ్లొచ్చి కల్లు ఖరాబైంది. చేదునాదు, తీపినాదుండె కల్లు గిప్పుడు సప్పసతుకయింది. గిప్పుడు కల్లు కోసం ఫోన్ చేసేటోళ్లు... కాల్వ కిందున్న, రమ్మంటే.. ఒస్తలేరు. మూసీనీళ్లు పారని బావుల కాడ కల్లుంటే చెప్పమని అడ్గుతున్నరు. తాళ్లు కూడ గీ కెమికల్ ఎక్వయినప్పటి సంది సచ్చిపోతున్నయి. పింజర కరిస్తె మన ఒంటి మీద ఎట్ల మచ్చలొస్తయో... తాటి ఆకుల మీద గట్ల మచ్చలయితున్నయి' అంటూ ఇప్పుడున్న పరిస్థితి గురించి చెప్పి బాధపడ్డడు.

గా ముంజలన్న అమ్ముకొస్తున్నరా అని అడిగిన. "మూసీ నీళ్లు పారిన చెట్ల కల్లే సయిస్తలేరు. ఇగ ముంజలెవడు తింటడని శానా మంది ఆ పని కూడ బంద్ పెట్టిర్రు. నేను 1999ల కాల్వ కింద తాళ్లెక్కుడు మొదలుపెట్టిన. గప్పుడు ఒక్కో చెట్టుకు 20.. 25 సీసాల కల్లు పారేది. గిప్పుడు మూడ్నాలుగు సీసాలు పారితే ఎక్వ" అని చెప్పుకుంట మల్లా ఎన్కటి రోజులొస్తె బాగుండు అనుకుంట "సరే బేటా... నేను చెట్లల్లకు పోయే టైమైంది" అని ఫోన్ పెట్టేసిండు.

రాజేందర్ సురకంటి
మూసీ పరివాహక ప్రాంతవాసి
సంగెం (వలిగొండ మండలం)



## ఇంటింటి సర్వే విధుల్లో టీచర్లు... సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

**ఇంటింటి కుటుంబ సర్వే విధుల నుంచి ఎస్జీటీలను మినహాయించాలన్న హరీశ్ రావు**

**సర్వేలకు ఎస్జీటీలను ఉపయోగించడం విద్యా హక్కు చట్టం ఉల్లంఘన అని వెల్లడి**

**ఈ నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తుందన్న హరీశ్ రావు**



హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, టీచర్లకు శాపాలుగా మారుతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఇంటింటి కుటుంబ సర్వేలకు టీచర్లను ఉపయోగించవద్దని సూచించారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఇంటింటి కుటుంబ సర్వే విధుల నుంచి ఎస్జీటీలను మినహాయించాలన్నారు. సర్వేలకు ఎస్జీటీలను ఉపయోగించడం అంటే విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించడమే అన్నారు. సర్వేకు ఎస్జీటీలు, హెడ్ మాస్టర్లను భాగం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. సర్వేలకు టీచర్లను వినియోగించి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 36,559 ఎస్జీటీలను, 3,414 మంది ప్రధానోపాధ్యాయులను ఈ సర్వేలో భాగం చేస్తూ నవంబర్ 1న విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధమన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకే పాఠశాలలు నిర్వహించాలనేది ఈ ఉత్తర్వుల సారాంశంగా కనిపిస్తోందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం, ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధులకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తోందన్నారు. ఇవి కాకుండా మరే ఇతర పనులకు వినియోగించకూడదని విద్యా హక్కు చట్టం చెబుతోందన్నారు. ఈ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుకోవడం విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికే వస్తుందన్నారు.

## మహిళపై సామూహిక అత్యాచారం

హైదరాబాద్ పెన్ పవర్: మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ముగ్గురు యువకులు ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. హైటెక్ సిటీ క్రాస్ రోడ్ ఓ భవనంలో పని ముగించుకొని వస్తుండగా, బట్టలు ఉతికే పని ఉందని, మాయ మాటలు చెప్పి యువకులు మహిళను తీసుకెల్లారు. గదిలో మహిళ పై లైంగిక దాడికి పాల్పడ్డారు. మహిళా కేకలు విని పక్కింటి మహిళ అలెర్ట్ అయింది. సదరు మహిళ రావడంతో ముగ్గురు పారిపోయారు. బాధితురాలు మధురానగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యా?దు చేసింది. పోలీసులు ఒకరిని పట్టుకున్రనారు. మరో ఇద్దరు పరారీలో వున్నారు.

# భారత్‌లో 2036 ఒలింపిక్స్!

- ఒలింపిక్ కమిటీకి కేంద్ర సర్కారు లేఖ
- 2025లో ఐఓసీ అధ్యక్ష ఎన్నికల తర్వాత నిర్ణయం
- రేసులో ఇతర దేశాలు కూడా..
- చర్చలు ప్రారంభించిన ఐఓసీ
- ఇండియా వైపు మొగ్గు చూపే అవకాశం!




హైదరాబాద్ పెన్ పవర్: ఒలింపిక్స్ క్రీడలకు భారత్ సిద్ధమైంది. 2036లో సమ్మర్ ఒలింపిక్స్, పారాలింపిక్స్‌కు ఆతిథ్యం ఇస్తామని తెలుపుతూ ఇంటర్నేషనల్ ఒలిపిక్స్ కమిటీకి భారత ఒలింపిక్స్ అసోసియేషన్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ పంపింది. ఒక వేళ ఈ అవకాశం లభిస్తే భారత్‌లో యువత సాధికారత, ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి పెంపొందుతుందని సర్కారు భావిస్తోంది. పలు సందర్భాల్లో ఈ క్రీడల నిర్వహణపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. స్వాతంత్ర్య వేడుకల్లో పారిస్ ఒలింపిక్స్ అథ్లెట్లతో జరిగిన సంభాషణల్లో 2036 ఒలింపిక్స్ నిర్వహణపై మాట్లాడారు. భారతదేశం 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమవుతోందని మోదీ చెప్పారు. ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలనూ చేస్తామని కూడా అన్నారు. ఏ విషయంలోనూ వెనక్కి తగ్గమంటూ క్లారిటీ ఇచ్చారు. ఇది 140 కోట్ల భారతీయుల కల అని, 2029 యూత్ ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇదిలా ఉండగా 2028 ఒలింపిక్స్ కోసం లాస్ ఏంజిల్స్, 2032 కోసం బ్రిస్బేన్ నగరాలు ధ్దమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అందరి చూపు 2036 ఒలింపిక్స్ పై పడింది. వచ్చే దాది జరిగే ఇంటర్నేషనల్ ఒలింపిక్స్ కమిటీ ఎన్నికల తర్వాత 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశం విషయంలో నిర్ణయ తీసుకునే అవకాశం ఉంది. ఇతర దేశాల నుంచి వచ్చే లెటర్లను పరిశీలించి అవకాశం ఇస్తుందని సమాచారం. స్పాన్సర్లు, ప్రసార హక్కులు, ప్రభుత్వ మద్దతు, ప్రజాఆదరణ.. ఇలా ఏ రకంగా చూసుకున్నా భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించడం వల్ల ఐఓసీకి లాభమే అవుతుందని క్రీడారంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఐఓసీ కూడా భారత్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది.

# కుర్చీని కాపాడుకోవడం కోసం హైడ్రా పేరుతో బెదిరింపులకు దిగుతున్నారు: కేటీఆర్



హైదరాబాద్ పెన్ పవర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి డబ్బులు పంపించాలని... పంపకుంటే ఢిల్లీ పెద్దలు ఊరుకోరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అందుకే హైడ్రా పేరుతో అందరినీ బెదిరిస్తున్నారని ఆరోపించారు. హైడ్రాను మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసి ఉండే బాగుండేదని... కానీ అదో బ్లాక్‌మెయిల్ దుకాణం అన్నారు. హైదరాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన తెలంగాణ రియల్టర్స్ ఫోరమ్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైడ్రాపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ గురించి అవగాహన లేనివారు... పరిశ్రమల గురించి అవగాహన లేనివారు నడుపుతున్నట్లుగా హైడ్రా ఉందని మండిపడ్డారు. తాము అధికారంలో ఉన్నప్పుడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ వింగ్ అని పెట్టామని... దానినే ఈ ప్రభుత్వం హైడ్రా అని మార్చిందన్నారు. హైడ్రా కారణంగా ఈ రోజు ఎవరైనా లేక్ వ్యూ అని పేరు పెట్టాలనుకున్నా భయపడుతున్నారన్నారు. బెదిరింపుల కారణంగా మార్కెట్ మొత్తం ఆగం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పిచ్చి నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ పడిపోతోందని.. మార్కెట్‌ను నాశనం చేశారని విమర్శించారు. ప్రాజెక్టులకు హైడ్రా క్లియరెన్స్ అని చెబుతున్నారని... కానీ అనుమతులు గాలిలో దీపం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్-బీపాస్ ప్రకారం 21 రోజుల్లో క్లియరెన్స్ వస్తోందా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ ధమాల్ అని పేపర్లలో వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ చేస్తోన్న పనికి ఆదాయం పడిపోయిందని... ప్రాజెక్టులు రద్దయ్యాయని... కొత్త ప్రాజెక్టులూ లేవన్నారు.

**కేసీఆర్ వచ్చాక భూముల ధరలు పెరిగాయి**

మా తాతకు 400 ఎకరాల భూమి ఉండేదని... కానీ నీళ్లు లేకపోవడంతో ఆ భూమి నిరుపయోగంగా ఉండేదని, భూమికి కూడా విలువ లేకుండెనని కేటీఆర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు మేలు చేయాలని నాటి పాలకులు ఆలోచన చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో 2014కు ముందు భూముల ధరలు చాలా తక్కువగా ఉండేవన్నారు. కేసీఆర్ కృషి వల్లే భూముల ధరలు పెరిగినట్లు చెప్పారు. సాగునీరు లేకపోతే వ్యవసాయం చేయడం సాధ్యం కాదని... అప్పుడు సంపద సృష్టి కూడా జరగదన్నారు. కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఇరవై నాలుగు గంటల విద్యుత్ ఇచ్చామని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో వచ్చిన మార్పులు ఏమిటో ప్రజలకు తెలుసునన్నారు. కానీ ఎన్నికలకు ముందు మార్పు... మార్పు అంటూ ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు ఏం చేశారో చూడాలన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో... రాష్ట్రం ఏర్పడినప్పుడు పెట్టుబడులు రావని భయపెట్టారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో రెండు రోజులు పవర్ హాలీడే ఉండేదన్నారు. కానీ కేసీఆర్ వచ్చాక అన్నీ సర్దుకున్నట్లు చెప్పారు.

# హైదరాబాద్‌లో ఇకపై హెల్మెట్ మస్ట్.. హెల్మెట్ లేకుండా తిరుగుతూ దొరికితే..



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలో ఇకపై హెల్మెట్ తప్పనిసరి చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే కఠిన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. నేటి నుంచే (నవంబర్ 5, 2024) కఠినంగా నిబంధనలు అమలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. అందులో భాగంగా ట్రాఫిక్ పోలీసులు నగరంలో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే 200 రూపాయలకు జరిమానాను పెంచారు.

రాంగ్ సైడ్, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపినా సీరియస్ యాక్షన్ తీసుకోవాలని పోలీసులు డిసైడ్ అయ్యారు. రాంగ్ సైడ్, రాంగ్ రూట్ వెళితే 2000 రూపాయల జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. సిటీలోని రోడ్డు ప్రమాదాలపై ఇప్పటికే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. పబ్ ల ఎదురే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ నిబంధనల గురించి.. అడిషనల్ సీపీ ట్రాఫిక్, విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. నేటి నుంచే హెల్మెట్ మస్ట్ నిబంధన అమల్లోకి తెచ్చామని చెప్పారు. బైక్ నడిపే వాళ్ళలో నూటికి నూరు శాతం మంది హెల్మెట్ ధరించి వాహనం నడిపేలా లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి నిబంధనలు అమలు చేస్తామని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే 2 వేల రూపాయలు ఫైన్ విధిస్తామని వాహనదారులను హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న టూ వీలర్స్ బాధితుల్లో ఎక్కువ మంది హెల్మెట్ లేకపోవడం వల్లే చనిపోతున్నారని ఆయన వివరించారు. ప్రమాదాలను నివారించేందుకే నిబంధనలు కఠినతరం చేశామని స్పష్టం చేశారు.

# బోయిన్‌పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్‌కు చేరుకున్న రాహుల్ గాంధీ



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌కు చేరుకున్నారు. సమగ్ర కుల గణన సదస్సులో పాల్గొనేందుకు ఆయన నగరానికి వచ్చిన సంగతి తెలిసిందే. బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్‌కు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి రాహుల్‌కు ఘన స్వాగతం పలికారు.బేగంపేట విమానాశ్రయానికి కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. సిటీలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.రాహుల్ గాంధీకి స్వాగతం పలికేందుకు ఐమాక్స్ ఇందిరా గాంధీ విగ్రహం నుంచి బేగంపేట విమానాశ్రయం వరకు బైక్ ర్యాలీ సాగింది. కేటీఆర్ కోరినట్లు రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు త్వరలో వస్తారని, నిరుద్యోగం అనే సమస్య దేశం మొత్తం ఉందని, త్వరలో నిరుద్యోగులతో రాహుల్ గాంధీ భేటీ అవుతాడని ఈ సందర్భంగా దానం నాగేందర్ చెప్పారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్ చేరుకున్న రాహుల్ గాంధీకి బోయిన్‌పల్లి తాడ్ బంద్ చౌరస్తా వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ భారీ జనంతో స్వాగతం పలికారు.

# యువతి ప్రాణం తీసిన నిర్మల్ టౌన్ ఖానాపూర్ రోడ్డులోని గ్రిల్-9 హెూటల్



**హైదరాబాద్ పెన్ పవర్::** నిర్మల్ జిల్లా కేంద్రం లోని గ్రిల్ నైన్ హోటల్లో భోజనం చేసిన బోత్ మండలం సెయింట్ థామస్ స్కూల్ స్టాఫ్ అస్వస్థతకు లోనయ్యారు. బైగా అనే యువతి ఫుడ్ పాయిజన్ కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.ఈ ఘటనపై యువతి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే హోటల్లో సోమవారం రాత్రి భోజనం చేసిన 20 మంది అస్వస్థతకు లోనయ్యారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ హోటల్‌ను అధికారులు సీజ్ చేశారు.ఈ హోటల్‌లో మండీ బిర్యానీ తిన్న పలువురికి ఫుడ్ పాయిజన్ అయి చికిత్స పొందుతున్నారు. నిర్మల్ టౌన్ ఖానాపూర్ రోడ్డులోని గ్రిల్ హోటల్‌లో ఆదివారం రాత్రి ఖానాపూర్‌కు చెందిన కొందరు.. నిర్మల్‌కు చెందిన అస్లాం, హుస్సేన్, షేక్ బాబా, షేక్ జాకీర్, సైఫ్ మండీ చికెన్ బిర్యానీ తిన్నారు. 13 మందికి ఫుడ్ పాయిజన్ అయి.. వాంతులు, విరేచనాలు కావడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరు సోమవారం మధ్యాహ్నం కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. మరో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. చికెన్ బిర్యానీ తినడంతోనే ఫుడ్ పాయిజన్ అయినట్టు బాధితులు, వైద్య సిబ్బంది తెలిపారు.

## సికింద్రాబాద్ ప్యారడైజ్ హెూటల్‌లో కేటీఆర్ సందడి...

### పార్టీ నాయకులతో కలిసి ప్యారడైజ్ హెూటల్‌కు వెళ్లిన కేటీఆర్

### అందరితో కలిసి బిర్యానీ ఆరగించిన కేటీఆర్

### వెయిటర్‌ను పిలిచి... పక్కన కూర్చోబెట్టుకొని ఫొటో దిగిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ హోటల్‌లో సందడి చేశారు. ఇందిరాపార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నాలో పాల్గొన్న అనంతరం మరికొందరు నేతలతో కలిసి కేటీఆర్ ప్యారడైజ్ హోటల్‌కు వెళ్లారు. ప్యారడైజ్ హోటల్లో హోటల్‌కు వచ్చే అందరిలాగా ఆయన టేబుల్‌పై కూర్చున్నారు. తోటి నాయకులతో కలిసి బిర్యానీ తిన్నారు.ఈ సమయంలో ఆయనను పలకరించేందుకు చాలామంది ఆసక్తి కనబరిచారు. కొందరు ఫోటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. భోజనం చేసి తిరిగి వెళ్తున్నవారు... అటువైపు నుంచి లోనికి వెళ్తున్నవారు కేటీఆర్‌కు షేక్ హ్యాండ్ ఇస్తూ ముందుకు కదిలారు. హోటల్‌లో పని చేసే ఓ వెయిటర్‌ను పక్కన కూర్చోబెట్టుకొని ఆయనతో ఫొటో దిగారు.

## హైదరాబాద్‌లో జోరుగా కల్తీ మిరప పొడి అమ్మకాలు..వ్యక్తి అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలో నిత్యావసరాల కల్తీ రోజురోజుకు పెరిగిపోతుంది. నిత్యావసరాలుగా మనం రోజు ఉపయోగించే పసుపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, సబ్బులు, నూనెలు ఇలా అన్ని రకాల వస్తువులు కల్తీ చేస్తున్నారు కల్తీగాళ్లు. హైదరాబాద్ సిటీలో ఏది కొనాలన్నా..జనం కల్తీ భయంతో జంకుతున్నారు. ఇటీవల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, నూనెలు తయారు చేసి అమ్ముతున్న ఘటనలు వెలుగు చూడగా..తాజాగా కల్తీ కారం తయారు చేస్తున్న ఓ వ్యక్తిని హైదరాబాద్ సెంట్రల్ జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు.

అఫ్జల్ గంజ్ లో ఓ ఇంటిపై దాడి చేసిన సెంట్రల్ జోన్ పోలీసులు.. 35 కేజీల కల్తీ కారం పొడిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రూపారామ్ ఖత్రీని అరెస్ట్ చేశారు. కారం పొడి ఎర్రగా కనిపించేందుకు, ఘాటు వచ్చేందుకు ఎరుపు రంగు, విషపూరిత రంగులు, నూనెలు కలిపి కల్తీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కల్తీ కారం పొడిని బ్రాండెడ్ కంపెనీల పేర్లతో ప్యాకింగ్ చేసి అమ్ముతున్నట్లు తెలిపారు.

## శంషాబాద్ ఆలయంలో విగ్రహాలు ధ్వంసం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని ముత్యాలమ్మ దేవాలయం లో దేవుడి విగ్రహాల ధ్వంసం ఘటనను మర్చిపోకముందే నగర శివారులోని శంషాబాద్ లో మరో దేవాలయం పై గుర్తు తెలియని దుండగులు దాడి కి పాల్పడడం కలకలం రేపింది. శంషాబాద్ ఎయిర్పోర్ట్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి హనుమాన్ దేవాలయం లోకి ప్రవేశించిన గుర్తు తెలియని దుండగులు నవగ్రహాలను రాళ్లతో ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి నవగ్రహాల ధ్వంసాన్ని చూసి గ్రామస్తులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అలర్ట్ అయిన శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. దుండగులు రాళ్లతో విగ్రహాలను ధ్వంసం చేసినట్లుగా ఆనవాళ్లు లభించాయి. ఈ మేరకు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించి ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. ఘటనను కాలనీవాసులు తీవ్రంగా ఖండిస్తున్నారు. వరుసగా ఆలయాలపై దాడులు జరుగుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

## బేస్ బాల్ ఆడుతూ విద్యార్థి మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలలో విషాదం చోటు చేసుకుంది. హాస్టల్ కు చెందిన 9వతరగతి విద్యార్థి ఆయన్ హుస్సేన్ ఉదయం వాకింగ్ చేసే సమయంలో మృతి చెందాడు.సంబంధిత పాఠశాల నిర్వహకులు తెలిపిన వివరాల ప్రకారం. పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థి ఫైయాజ్ హుస్సేన్ ప్రతిరోజు లాగానే బేస్ బాల్ ఆడుతున్న సమయంలో అస్వస్థత కు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమయినా పాఠశాల సిబ్బంది పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతికి గల పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

## నక్కపల్లి టోల్ ప్లాజా వద్ద మహిళా అఘోరి హల్చల్

**హైదరాబాద్ పెన్ పవర్:** నక్కపల్లి టోల్ ప్లాజా దగ్గర మహిళా అఘోరి హల్ చల్ చేసిందిజ రెండు గంటల పాటు అక్కడ హైడ్రామా నెలకొంది. టోల్గేట్ సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించారని అఘోరి ఆరోపించింది. నాగసాధుకే రక్షణ లేకపోతే..మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించింది. అందుకే కలియుగం ఇలా మారిపోయింది. సనాతన ధర్మం కోసం పోరాడుతూనే ఉంటా. అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని చెప్పింది.

# కాంగ్రెస్ లో గ్రూపుల లొల్లి..



**హైదరాబాద్, నవంబర్ 5, పెన్ పవర్:** లంగాణ రాష్ట్రం సిద్ధించాక జరిగిన తొలి, మలి ఎన్నికల్లో.. రెండు పర్యాయాలు అధికారానికి దూరమైంది కాంగ్రెస్. గత ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రజాపాలనే ధ్యేయంగా సాగుతున్న పార్టీలో నామినేటెడ్ పోస్టుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు నామినేటెడ్ పదవులపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచిన తరుణంలో.. నామినేటెడ్ పదవులను ఎప్పుడు భర్తీ చేస్తారని ప్రశ్నిస్తున్నారట. ఉమ్మడి మెదక్ జిల్లాలో మంత్రుల మధ్య సమన్వయ లోపం పార్టీకి ఇబ్బందిగా మారుతుందన్న విమర్శలు క్యాడర్ లో వినిపిస్తున్నాయి. గ్రూప్ లను ఏకం చేసి పదవుల కేటాయింపునకు కలిసికట్టుగా పని చేయాల్సిన మంత్రుల మధ్యే సమన్వయం లోపించిందన్న భావన క్యాడర్ లో నెలకొందట. సిద్దిపేట జిల్లా నుంచి పొన్నం ప్రభాకర్, సంగారెడ్డి జిల్లా నుంచి దామోదర రాజనర్సింహ మంత్రులుగా ఉండగా.. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా కొండా సురేఖ ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో పదవులు ఆశిస్తున్న ఆయా గ్రూపుల నేతలు తమకు సాన్నిహిత్యం ఉన్న మంత్రుల వద్దకు వెళ్లి పైరవీలు చేస్తున్నారట. అయితే ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడంతో.. ఉమ్మడి జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి ఫైనల్ లిస్ట్ సిద్ధం కావడం లేదని చర్చ జరుగుతోంది.జిల్లా ముఖ్యనేతలను నమ్ముకుని పనిచేసిన సీనియర్లు కూడా.. అటు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లు, ఇటు జిల్లా స్థాయి పదవులను ఆశిస్తూ ఎదురు చూస్తున్నారట. అయితే గతంలో జిల్లాలో ఒకటి రెండు చోట్ల మార్కెట్ కమిటీ నియామకాలకు సంబంధించి కొందరి పేర్లు ఖరారు చేసినప్పుడు ఆయా గ్రూపుల మధ్య విభేదాలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. దాంతో ఈ పదవుల కేటాయింపు వ్యవహారం హస్తం నేతల్లో చర్చనీయాంశంగా మారిందని పొలిటికల్ వర్గాల్లో డిస్కషన్ నడుస్తోంది.మరోవైపు ఉమ్మడి జిల్లాలో ప్రోటోకాల్ వివాదాలు నిత్యకృత్యంగా మారాయట. సిద్దిపేట జిల్లాలో విపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలవడం, అధికారంలోకి కాంగ్రెస్ రావడంతో ఇరు పార్టీల నేతల మధ్య ప్రోటోకాల్ వివాదం నడుస్తోంది. ఇటీవల దుబ్బాకలో కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, జనగామ నియోజకవర్గానికి సంబంధించి చేర్యాలలో కొమ్మూరి ప్రతాపరెడ్డి స్టేజ్ మీదకు రావడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓపెన్ గానే ప్రశ్నించారు. దీంతో మంత్రి కొండా సురేఖ సమక్షంలోనే ఇరుపార్టీల మధ్య రచ్చ రచ్చ జరిగింది. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రోటోకాల్ వివాదానికి నామినేటెడ్ పోస్టులతో చరమగీతం పాడొచ్చని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారట. నామినేటెడ్ పోస్టులు ఇస్తే అధికారికంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని.. విపక్షాలకు ప్రోటోకాల్ పేరిట గొడవ చేసే అవకాశం ఉండదన్న భావన.. ఎన్నికల్లో ఓడిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ లలో వ్యక్తం అవుతుందట. అయితే గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వకూడదని సీఎం రేవంత్ రెడ్డి.. పార్టీ అధిష్టానం నిర్ణయించడంతో వారి ఆశలు ఎంతవరకు నెరవేరుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.కాంగ్రెస్లో గ్రూపుల వ్యవహారాన్ని పార్టీ పెద్దలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని కార్యకర్తలు వాపోతున్నారట. ఇప్పటికీ కింది స్థాయి కార్యకర్తలు గ్రూపు రాజకీయాలతో సతమతమవుతున్నామని.. ఎటు వెళ్లాలో తెల్చుకొని పరిస్థితుల్లో ఉన్నామని చెబుతున్నారట. అధిష్టానం దృష్టికి వెళ్లినా కూడా వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు ముగియగా.. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు సమీపిస్తున్న తరుణంలో గ్రూపు రాజకీయాలతో.. తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే పరిస్థితి నెలకొందని కేడర్ లో ఆందోళన వ్యక్తమవుతుందట. కాంగ్రెస్ లో అంతర్గత కుమ్ములాటలు పార్టీకి నష్టం కాబోతున్నాయా? నామినేటెడ్ పోస్టులతో గ్రూపులకు చెక్ పెట్టవచ్చా? మంత్రుల మధ్య సమన్వయ లోపం క్యాడర్ కు మైనస్ అవుతుందా? వీటికి అధిష్టానం ఎలా చెక్ పెట్టబోతుందని చర్చ జరుగుతోంది.

# సల్లంగా చూడయ్యా నాగరాజా



**హైదరాబాద్ పెన్ పవర్:** మంథని పట్టణంలో నాగుల చవితి వేడుకలను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలోని శ్రీ నాగులమ్మ ఆలయం తో పాటు, పెంజేరుకట్టలోని నాగుల సంధిలో శ్రీనాగమయ్య పుట్ట వద్ద భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సల్లంగా చూడయ్యా నాగరాజా అంటూ మహిళలు నాగదేవతలను వేడుకున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి నోముల దారాలు, నువ్వులు, పండ్లు, పాలతో పాటు చలిమిడి ముద్దలు తయారు చేసుకుని పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు.

ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బోయినిపేటలోని నాగులమ్మ దేవాలయంలో గల మైసమ్మ, రావి, వేప చెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మంథని మండలంలోని పలు గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. గాజులపల్లిలోని శ్రీ సంతాన నాగేంద్రస్వామి ఆలయంతో పాటు గ్రామాల్లోని పుట్టల వద్ద పూలు, పండ్లతో భక్తులు పూజలు నిర్వహించారు. సంతాన నాగేంద్రస్వామిగా మంథని ప్రాంతంలో పేరుగాంచి ఉండటంతో గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున వచ్చి, పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆలయానికి భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ సందడిగా మారింది. నాగదేవత ఆలయాల వద్ద ఆవు పాలను ఉచితంగా భక్తులకు పంపిణీ చేశారు. మంథని పట్టణంలోని నాగుల సంధి వద్ద గల శ్రీనాగమయ్య పుట్ట, బోయినిపేటలోని నాగులమ్మ దేవాలయాన్ని, గాజులపల్లి సంతాన నాగేంద్ర స్వామి దేవాలయాన్ని మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమా సురేష్ రెడ్డి సందర్శించి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# క్రీడలతో పాటు విద్యలో కూడా విద్యార్థులు రాణించాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**క్రీడలతో పాటు విద్యలో కూడా విద్యార్థులు రాణించాలని గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ అన్నారు. మంథని గురుకుల పాఠశాల విద్యార్థులు అసాధారమైన ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కాలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో మంథని పట్టణానికి చెందిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలురు) అత్యున్నత ప్రతిభ కనబరుస్తూ బహుమతులు కైవసం చేసుకోవడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం వీరిని ప్రిన్సిపల్ శ్రీనాథ్ ప్రత్యేకంగా అభినందించి, బహుమతులను అందజేశారు. అండర్-19 కబడ్డీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభిరామ్, పదో తరగతి చదువుతున్న కార్తీక్, ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న వరుణ్, అండర్ 14 ఖో ఖో విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న శివ కిషోర్, శివ చరణ్ తేజ, అథ్లెటిక్స్ విభాగంలో ఇంటర్మీడియట్ బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న సాత్విక్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో ఖో ఖో విభాగంలో పాఠశాల ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, బహుమతులు సాధించిన విద్యార్థులను, పిడి రమేష్, పిఈటి పుష్పలతలను ప్రిన్సిపాల్ శ్రీనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనాథ్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిస్తే ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఉంటుందని ఆయన వివరించారు. క్రీడల వల్ల మానసిక ఆనందం కలుగుతుందని, ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో ఏదో ఒక క్రీడలో ఆరితేరాలని ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కళాశాల/పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# రామగిరి ఖిల్లా పై ఔషధ మొక్కలు పరిశోధన చేస్తా



**హైదరాబాద్ పెన్ పవర్:**రామగిరి మండలంలోని రామగిరి ఖిల్లా పై ఔషధ మొక్కలను పరిశోధనలు చేస్తానని శాతవాహన యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమూర్తి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు.

హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ని కలవడం జరిగింది. శాతవాహన విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహమూర్తి తో కలిసి రామగిరి ఖిల్లా మందు మొక్కలపై ప్రాథమిక పరిశోధన పత్రాన్ని మంత్రివర్యుల కి అందించడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెల్లి కిరణ్ గౌడ్ కూడా పాల్గొన్నారు. రామగిరి ఖిల్లా కొండలపై విస్తరించి ఉన్న మందు మొక్కలు మరియు వృక్ష వైవిధ్యాన్ని గురించినటువంటి ప్రాథమిక పరిశోధనా పత్రాన్ని అంతర్జాతీయ పరిశోధన పత్రికలో ప్రచురించడం జరిగింది. దాదాపుగా 300కు పైగా పైచిలుకు మందు మొక్కలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని సేకరించడం జరిగింది. ఈ క్రమంలోనే మరింత పరిశోధన జరిపి రామగిరి జిల్లా ముందు మొక్కల గురించిన సమగ్ర సమాచారాన్ని పుస్తక రూపంలో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నాము. ఈ సందర్భంగా మంత్రివర్యులు స్నేహితులు దుద్దిల్ల శ్రీధర్ బాబు నీ కలిసి మరిన్ని పరిశోధనల కొరకు ప్రోత్సహం ఇవ్వాలని కోరడం జరిగింది. మంత్రి ఆ నివేదికను పరిశీలించి సానుకూలంగా స్పందించారు.

# మద్ది అంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**హైదరాబాద్ పెన్ పవర్:**జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసములో వచ్చిన మొదటి మంగళవారం కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దేవాలయములో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు , కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాంతం రంగప్రసాద్ మాట్లాడుతూ కార్తీకమాస ఉత్సవాలు , సప్తహ ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రతిరోజు విశిష్ట పూజలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కావున ప్రతి ఒక్కరూ మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకుని, తీరదప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్వి చందన , పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ , కురగంటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాంప్టన్ ఆలయం వద్దకు వందలాది హిందువులు

**.. జైశ్రీరామ్ నినాదాలు**

**హైదరాబాద్ పెన్ పవర్:**బ్రాంప్టన్ హిందూ సభా మందిరంపై ఖలిస్థానీల దాడులు కెనడాలో హిందువులను సంఘటితం చేస్తున్నట్టు కనిపిస్తోంది. విషయం తెలియగానే వందల సంఖ్యలో వారు ఆలయం వద్దకు చేరుకున్నారు. 'మనమంతా ఒక్కటవ్వాలి' అంటూ అక్కడి పూజారి పిలుపునిచ్చారు. జాతీయ పతాకంతో పాటు కాషాయ జెండాలు చేతబూనిన ప్రజలు 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేశారు. ఖలిస్థానీలకు వ్యతిరేకంగా హిందువులు రోడ్లమీదకు రావడంతో వివాదం మరో టర్న్ తీసుకుంది.

## జిల్లా ఇన్చార్జి మంత్రిగా మొదటిసారి కాకినాడ వచ్చిన మంత్రి నారాయణ

**హైదరాబాద్ పెన్ పవర్:**కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయానికి వచ్చిన మంత్రి నారాయణ కు కూటమి పార్టీల నేతలు ఘన స్వాగతం పలికారు. టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు చిన రాజప్ప,ఎమ్మెల్యే లు పంతం నానాజీ,వరుపుల సత్య ప్రభ,ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్,పార్టీ ఇన్చార్జి లు,ముఖ్య నేతలు పాల్గొన్నారు. తరువాత అయన టీడీపీ, జనసేన,బీజేపీ ముఖ్య నేతలతో సమావేశమైయారు. జిల్లాలో పార్టీల పరిస్థితి,కూటమి పార్టీ నేతల మధ్య సమన్వయం,ఎమ్మెల్సీ ఎన్నికలు పై సమావేశంలో చర్చ జరిగింది. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉండటంతో అధికారిక కార్యక్రమాలు కాకుండా కేవలం పార్టీ కార్యక్రమాలకే మంత్రి తన పర్యటన పరిమితం చేసారు.

## సదాశివపేటలో సీసీఐ కేంద్రాన్ని ప్రారంభించిన నిర్మల జగ్గారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**సదాశివపేట మండలంలోని ఆత్మకూర్ రోడ్ , వెంకటేశ్వర కాటన్ మిల్లులో టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సిసిఐ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణ, ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ,మండల పార్టీ అధ్యక్షుడు సిద్ధన్న పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, మరియు తాజా మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు ,రైతు సోదరులు మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నిలదీస్తున్న పార్టీ శ్రేణులు

**హైదరాబాద్ పెన్ పవర్:**అధికార పార్టీ ఎమ్మెల్యే లపై సొంత కేడర్ రివర్స్ ఎటాక్ ఇవ్వడం కలకలం రేపింది. ఆరు గ్యారెంటీలు,రైతుల ఇబ్బందులపై కార్యకర్తలు గళం విప్పారు. ఎమ్మెల్యేల సాక్షిగా ప్రభుత్వ వైఖరిపై పార్టీ శ్రేణులు అసంతృప్తి వెళ్లగక్కారు. నల్లగొండ లోని ఓ సమావేశంలో ఎమ్మెల్యేలకు కార్యకర్తలు సూటి ప్రశ్న వేసారు. మరోవైపు, కాంగ్రెస్ కార్యకర్తల ఆక్రోశాన్ని క్యాష్ చేసుకునే పనిలో బీఆర్ఎస్ వుంది. "కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై సొంత పార్టీ నేతల అసంతృప్తి" అంటూ గులాబి దళం సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తోంది. ఎమ్మెల్యేలు ఉన్న వేదికపై కార్యకర్తల కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆరు గ్యారెంటీలు అన్ని చోట్లా అమలు కావడం లేదు. గ్రామాల్లో ఆరు గ్యారెంటీలపై ఒక్కొక్కరు నిలదీస్తుంటే.. మాకు తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియడం లేదు. వేల పెన్షన్ ఏమైంది అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో రైతుల ధాన్యం వారం రోజుల్లో కొనేవారు. పది రోజుల్లో డబ్బులు అకౌంట్ లో పడేవి. రైతులు ఐకెపి సెంటర్లకు ధాన్యం తెచ్చి నెల దాటినా పట్టించుకునే నాదుడు లేదు. రైతుల దుస్థితి చూస్తుంటే మాకు గుండె తరుక్కుపోతుందని కాంగ్రెస్ కేడర్ వాపోతుంది..

# అమెరికా అధ్యక్ష ఎన్నికలు..ఇండియన్ ఐటీపై ప్రభావం చూపే ఐదు అంశాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే దానిపైనే ఇప్పుడు అందరి దృష్టి. ట్రంప్, కమలా హారిస్ మధ్య హోరాహోరీ పోటీ కొనసాగుతున్న క్రమంలో నెక్ టు నెక్ ఫైట్ ఫలితాలకోసం ఇండియా మార్కెట్ తో పాటు గ్లోబల్ మార్కెట్లు ఎదురు చూస్తున్నాయి. అమెరిక అధ్యక్ష ఎన్నికల ఫలితాల ప్రభావం ఇండియాను ఎంత వరకు ప్రభావితం చేయనుంది.. ఇండియన్ ఇన్ ఫర్మేషన్, టెక్నాలజీ సంస్థలను ఏవిధంగా ప్రభావితం చేస్తుందో తెలుసుకుందాం.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచే అభ్యర్థిపై ఇండియన్ ఐటీ కంపెనీలు భవితవ్యం ఆధారపడి ఉంటుందని చెప్పొచ్చు. ఎందుకంటే ఐటీ కంపెనీల క్లయింట్లలో ఎక్కువ మంది యూఎస్ కు చెందిన వారు కావడమే దీనికి కారణం.అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల తర్వాత జరిగే రాజకీయ, విధాన పరమైన మార్పు ఇండియన్ ఐటీ కంపెనీలపై ప్రభావం చూపుతుంది. వీసా పాలసీల నుంచి కార్పొరేట్ పన్నుల వరకు భారతీయ ఐటీ సంస్థలను ప్రభావితం చేసే అంశాలను గురించి తెలుసుకుందాం.




**H-1B వీసాలపై..**

చాలా ఐటీ కంపెనీలకు క్లయింట్ సైట్ లకు వెళ్లి పనిచేయడానికి ఉద్యోగులు అవసరం.ఆన్ సైట్ లో పనిచేసే ఉద్యోగుల కోసం అమెరికా H-1B వీసాను జారీ చేస్తుంది. అయితే ఇటువంటి ఆన్ సైట్ ఉద్యోగుల భవితవ్యం..H-1B వీసాల జారీపై ఆధారపడి ఉంటుంది.

డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు H-1B వీసాల జారీ గణనీయంగా తగ్గింది. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ , యూఎస్ సిటిజన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ డేటా ప్రకారం.. ఉపాధి కోసం H-1Bపిటిషన్ల తిరస్కరణ2015ఫైనాన్షియల్ ఇయర్ లో 6 శాతం ఉంటే..2018లో 24 శాతానికి పెరిగాయి.అయితే 2021లో 4శాతం గణనీయంగా తగ్గాయి. బిడెన్ అధ్యక్షతన 2021, 2022లో H-1B వీసాల తిరస్కరణ అత్యల్పంగా 2 శాతం ఉంది.

భారతీయ ఐటీ కంపెనీలు ఇప్పుడు H-1B వీసా కోసం తిరస్కరణకు గురయ్యే అవకాశం తక్కువ. ఎందుకంటే US లోనే స్థానిక వర్క్‌ఫోర్స్‌ను నిర్మించుకున్నందున H-1B వీసాపై ఐటీ కంపెనీలు ఆధారపడటం ఇప్పుడు తగ్గిపోయింది. ఇన్ఫోసిస్ లిమిటెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ , విప్రో లిమిటెడ్ వంటి పెద్ద ఐటి ప్లేయర్‌లకు H-1B అనుమతుల తగ్గుదల ఇందుకు నిదర్శనం.

**H-1B వీసా కార్మికులకు అధిక వేతనాలపై..**

ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు H-1B ఉద్యోగుల కనీస వేతనం భారీగా పెంచాలని ప్రతిపాదించారు. అయితే అది కోర్టులో పెండింగ్ లో ఉంది..ఒకవేళ ట్రంప్ గనక అధ్యక్షుడైతే మళ్లీ ఈ ప్రతిపాదన ప్రవేశపెట్టే అవకాశం ఉంది. తాజా డేటా ప్రకారం.. H-1B వీసా ఉద్యోగుల వేతనాలు భారీగానే ఉన్నాయని తెలుస్తోంది. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్ డేటా ప్రకారం 2021లో సాధారణంగా %ఖు% ఉద్యోగులకంటే %H-1B ఉద్యోగుల వేతనాలు 2.4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. 2003 నుంచి 2021 మధ్య, H-1B కార్మికుల సగటు వేతనం 52శాతం పెరిగింది. మొత్తం %ఖు%లో 39శాతం పెరిగింది.

**పన్ను రేటు ప్రభావం**

రిపబ్లికన్ ప్రభుత్వంలో పన్ను రేట్లు కార్పొరేట్లకు ప్రయోజనకరంగా ఉంటాయని బ్రోకరేజీలు చెబుతున్నాయి. ఆర్థిక విస్తరణ విధానంలో పన్ను రేట్లు తగ్గించబడతాయని.. భారతీయ ఐటీ కంపెనీలకు ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నాయి.

**ఫెడ్ రేట్ ప్రభావం..**

ట్రంప్ అధికారంలోకి వస్తే ఫెడ్ నిర్ణయాలపై ప్రభావం పెరుగుతుందంటు JM ఫైనాన్సియల్ చెబుతోంది. ట్రంప్ ప్రతిపాదిత విధానాలు అధిక వడ్డీరేట్లకు దారి తీయొచ్చుని , ప్రపంచ వృద్ధి మందగించవచ్చుని అంటున్నారు. ఫలితంగా ద్రవ్యోల్బణం బాగా పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఇది క్లయింట్ బడ్జెట్, ఐటీ ఖర్చులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొత్తంగా భారతీయ ఐటీ కంపెనీలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**విదేశీ కరెన్సీపై..**

ట్రంప్ పాలనలో టారిఫ్, ఆర్థిక వృద్ధి కారణంగా డాలర్ పడుతుంది.. తద్వారా రూపాయి పరంగా భారతీయ ఐటీ కంపెనీలకు అధిక ఆదాయం వస్తుంది. అయితే హారిస్ పాలనలో డాలర్ బలహీన పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితంగా భారతీయ ఐటీ కంపెనీలకు తక్కువ ఆదాయం వచ్చే రావొచ్చని భావిస్తున్నారు.

**రెవెన్యూ ప్రభావం..**

ట్రంప్ హయాంలో 2017నుంచి 20 మధ్య ఇన్ఫోసిస్ ఆదాయం %జూ+=% 9.9 శాతంగా ఉంది. 2017 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 68 వేల 484 కోట్లుగా ఉందగా.. 2021-24 ఆర్థిక సంవత్సరంలో బిడెన్ పాలనలో ఇన్ఫోసిస్ ఆదాయం %జూ+=% 15.2శాతంగా ఉంది. 2021 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.1 లక్ష కోట్లు , 2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.53 లక్షల కోట్లుగా ఉంది.

# అమెరికాలో ఫైనల్ పోలింగ్ ప్రారంభం.. అక్కడ మాత్రం రిజల్ట్ వచ్చేసింది..!







**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో అధ్యక్ష పోరు రసవత్తరంగా మారింది. పోలింగ్ డే రానే వచ్చింది. అమెరికాలోని ఈస్ట్ కోస్ట్ ప్రాంతంలోని వెర్మంట్ లో తెల్లవారుజామున 5 గంటలకు పోలింగ్ మొదలైంది. ఇక్కడ పోలింగ్ మొదలవడంతో అధికారికంగా యూఎస్ ఎలక్షన్ డే మొదలైంది. ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికలు నువ్వా-నేనా అనే రీతిలో సాగుతున్నాయి.

అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. డిక్స్ విల్లే నాచ్ అనే ప్రాంతంలో మాత్రం అర్ధరాత్రే పోలింగ్ మొదలైంది. పోలింగ్ కూడా ముగిసింది.అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డిక్స్ విల్లే నాచ్ అనే ప్రాంతంలో పోలింగ్ అమెరికాలోని అన్ని ప్రాంతాల్లో కంటే ముందే నిర్వహించి పూర్తి చేయడం, రిజల్ట్ అనౌన్స్ చేయడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. డిక్స్‌విల్లే నాచ్‌లో ఆరుగురు ఓటర్లు అర్ధరాత్రే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఆరు ఓట్లలో మూడు ఓట్లు ట్రంప్‌కు, మూడు ఓట్లు కమలా హారిస్‌గా మద్దతుగా పోల్ అవడం యూఎస్ ఎలక్షన్స్ ట్రెండ్ ఎలా ఉండబోతోందో స్పష్టం చేశాయి. డిక్స్ విల్లే నాచ్‌లో రిజిస్టర్డ్ ఓటర్లు 6 మందే కావడం గమనార్హం.డిక్స్‌విల్లే నాచ్‌తో పాటు హార్ట్స్ లొకేషన్, మిల్స్ ఫీల్డ్ ప్రాంతాల్లో కూడా అర్ధరాత్రే పోలింగ్ మొదలవుతుంది. మొత్తం 50 రాష్ట్రాలలో ఓటర్లు పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరారు. అధ్యక్షుడిని ఎంపిక చేసే ఎలక్టోరల్ కాలేజీ ప్రతినిధులను ఓటర్లు ఎన్నుకోనున్నారు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో డెమోక్రాట్ల తరఫున కమలా హారిస్, రిపబ్లికన్ల తరఫున డొనాల్డ్ ట్రంప్ బరిలో ఉన్నారు.

మంగళవారం సాయంత్రం ఓటింగ్ పూర్తయిన వెంటనే లెక్కింపు మొదలు పెట్టి, అధికారులు వెంట వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. రాష్ట్రాల వారీగా ఫలితాలు వెలువడేందుకు ఒక్కోసారి రోజుల తరబడి సమయం పడుతుంది. అయితే, ఎలక్టోరల్ కాలేజీలో తమ మద్దతుదారులు కనీసం 270 సభ్యులను గెలిపించుకోగలిగిన అభ్యర్థి అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చుంటారు. గెలిచిన అభ్యర్థి వచ్చే ఏడాది జనవరి 20న ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపడతారు.

# మోపిదేవి ఆలయంలో నాగుల చవితి

**హైదరాబాద్ పెన్ పవర్:** నాగులచవితి పర్వదినం అనాదిగా వస్తున్న పర్వదినం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సుప్రసిద్ధ మోపిదేవి పుణ్యక్షేత్రంలో నాగుల చవితి వేడుకలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. మంగళవారం తెల్లవారుజామున కుటుంబ సమేతంగా విచ్చేసిన ఎమ్మెల్యే స్వామివారి నాగ పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలో కొలువున్న స్వామి దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావు ఆధ్వర్యంలో వేద పండితులు ఆయనను ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటాలు ప్రసాదాలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహెంజోదారో శిధిలాల్లో కూడా నాగదేవతకు కొలవటం కనిపిస్తుందన్నారు. బౌద్ధుల కాలంలో కూడా నాగదేవతకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చారిత్రాత్మకమైన మోపిదేవి దేవాలయానికి ఎంతో విశిష్టత ఉందని, మహాకవి వేమన శతకాల్లో కూడా మోపిదేవి దేవస్థానం ప్రస్తావన ఉంటుందన్నారు. మోపిదేవి క్షేత్రాన్ని దర్శించుకుంటే ఖచ్చితంగా ఫలసిద్ధి జరుగుతుందనే విశ్వాసం తెలుగు వారందరిలో ఉందన్నారు